# 3

## అపస్వరాలు

ప్రతి మానవుని జీవితంలో అనుదినం యెంతోమంది వ్యక్తులతో పరిచయం ఏర్పడుతుంది. అందులో కొంతమంది వ్యక్తుల తాలూకు అనుభవాల యొక్క మలినచ్ఛాయలు మాత్రమే మస్తిష్కంలో మసక కమ్ముకొని ఉంటాయి. అవకాశము దొరికినప్పుడు ఆ మసక తెరలు తొలిగిపోయి మళ్ళీ స్పష్టంగా కళ్ళకు కన్పిస్తాయి.

నా హాస్టలు జీవితంలో తటస్థపడ్డ ఓ వ్యక్తి యెప్పుడూ నా కళ్ళకు కన్పిస్తూనే ఉంటుంది. ఎప్పుడూ దేన్నో వెతుకుతూండే ఆ లోతైన కళ్ళు. దాదాపు పై పెదవివరకు వంగి ఉన్న ఆ పొడవైన ముక్కు. చిన్న గడ్డంలోని సగం భాగాన్ని ఆక్రమించి ఉండే లావాటి మెడనీ ఆ నల్లని లావాటి శరీరమూ ఎప్పుడూ నా కనుపాపల్లో కదులుతూ ఉంటాయి.

లలిత హాస్టలుకు వచ్చిన మొదటి రోజే అందరి దృష్టినీ ఇట్టే ఆకర్షించి దాని ముఖ్య కారణం అసాధారణమైన ఆమె చూపులే. ఆమె రూపం అసహ్యంగా లేకపోయినా, మొత్తంమీద వెగటు కలిగించేలా ఉన్నది. ఆమె వేషం మాత్రం బాగా డబ్బు గలదనే విషయాన్ని రుజువు చేస్తుంది.

మా వార్డన్ ఆ అమ్మాయిని నా రూములోనే ఉంచింది. ఒకే రూములో ఉన్నా రెండు రోజుల వరకు ఒకరితో ఒకరం మాట్లాడుకోలేదు. మిగతా విద్యార్థినులు కూడా దూర దూరంనుండే ఆ అమ్మాయి రూపాన్నీ, బెదురు చూపులనూ వర్ణించుకుంటూ, నవ్వుకుంటూ వెళ్ళిపోయేవారు. అందులో నాకూడా భాగం లేకపోలేదు లెండి. ఆ రెండు రోజులూ గదిలో దిగాలు పడి కూర్చున్నది. ఆమె కళ్ళనుండి ఎవరికీ అర్థంకాని బాధ తొంగి చూస్తుండేది, చివరకు జాలివేసి నేనే మాట్లాడించాను. బాగానే మాట్లాడింది.

వారం రోజుల్లోనే అందరూ మమ్మల్ని గాఢ స్నేహితులంటూ ఎగతాళిచేయ ప్రారంభించారు. ఎప్పుడూ నన్ను వదలకుండా నాతోనే

తిరిగేది. నేను ఇంకొకరితో మాట్లాడటం ఆమెకు ఇష్టముండేది కాదు. హాస్టల్లోని ప్రతివారి వయస్సూ, వారికి పెండ్లి అయినదీ, లేనిదీ, అయితే భర్త ఏంచేస్తుంటాడో? ఎలా ఉంటాడో? ఇలాంటివే లక్ష ప్రశ్నలు వేస్తూ నా ప్రాణం తీస్తుండేది. ఆమె మాట్లాడే ప్రతి వాక్యంలోనూ అసూయ పుట్టి పడుతూండేది. కోపం వచ్చి విసుక్కుంటే ఏడ్చేది. మరల జాలివేసి నేనే పలకరించేదాన్ని. తనను అడగకుండానే తన వయస్సు పంథొమ్మిదనీ, లావుగా ఉండటంవల్ల పెద్దదాన్నిగా కనిపిస్తాననీ చెప్పేది. తనతో మాట్లాడిన ప్రతి వారికీ లలిత చెప్పే మొదటి వాక్యమదే.

హాస్టల్లో ఎవరికోసం విజిటర్సు వచ్చినా లలిత కళ్లలో పడకుండా పోలేరు. ముఖ్యంగా ఆ వచ్చినవారు మగవాళ్ళయితే ఆమె ఆ ప్రాంతాల్లోనే తారట్లాడుతూ ఉంటుంది. అప్పటి ఆమె చూపులు చూసినవాళ్ళకే తెలుస్తుంది కాని చెప్పటం చాలా కష్టం. ఇంటి యజమాని కొడుకు రెండు చేతుల్లో లడ్లు తెచ్చుకుని బొక్కుతున్నాడనుకోండి. అప్పుడు ఆ ఇంట్లో అంట్లు తోమే ఏ "మాలచ్చి" కొడుకో అదే వయస్సులో వున్నవాడు చూసే చూపులే అవి. ఆ సరిగ్గా అలాగే...కొంచెం కొంచెం తృప్తితో, కొంచెం కొంచెం ఈర్ష్యా భావంతో కొంతసేపు అలా చూసి మళ్ళీ ఎదుటివారు ఏదో అవినీతి కార్యం చేస్తున్నట్లు. లావాటి ఆ క్రింది పెదివిని ఇంకొంచెం క్రిందకు వ్యాపింపచేస్తూ, ముఖం తిప్పుకుని వెళ్ళిపోయేది. మరల ఎక్కువసేపు గదిలో ఉండలేకపోయేది. మధ్య మధ్య ఆ వచ్చినవారు వెళ్లారో లేదోనని తొంగి చూస్తుండేది.

ఆమెతో స్నేహం ఒక నెలగోజుల్లోనే నాకు మొహం మొత్తింది. వారానికి ఒకరు చొప్పున మా హాస్టల్లోని అందరితో స్నేహం చేసింది. కొత్త వాళ్ళు దొరగ్గానే పాతవాళ్ళతో మాట్లాడేదికాదు. వాళ్ళల్లో ఎవరైనా ఎదురుపడితే శత్రువును చూసినట్లు బెదురు చూపులు చూస్తూ తప్పుకు పోయేది. తన నీడను చూసి తనే భయపడుతున్నట్లు ప్రవర్తించేది.

తనతో స్నేహం చేసిన ప్రతివారికీ మిగతా అంతా నీతి దూరులనీ, దొంగలనీ, అందువల్ల వాళ్ళ స్నేహం మానేశాననీ చెప్పింది. ఇంకా ఒకరిమీద ఇంకొకరికి ఎన్నో అబద్ధాలు చెప్పింది. చివరికి హాస్టల్లోని విద్యార్థినులందరికీ లలిత అంటే అసహ్యం. కోపం కూడా కలుగుతుంది. కాని ఆమెను మా

వార్డెను చాలా ప్రేమగా చూడటంవల్ల మే మెవరమూ ఆమెను యేమనటానికీ సాహసించలేకపోయాము.

క్రమంగా హాస్టల్లో చిన్న చిన్న వస్తువులు కన్పించడంలేదు. నా రూములో సబ్బు దగ్గరనుండీ శికాయవరకూ పోతున్నవి. దీనికంతా కారణం లలిత దేనని మాలో కొంతమందికి నమ్మకం కలిగింది. ఎలాగయినా లలితను దొంగగా రుజువుచేసి మా కక్షను తీర్చుకోవాలనుకున్నాము. అందులో ముఖ్యపాత్ర నాదనే చెప్పాలి.

రాత్రిళ్ళు గదిలో పాటలు పాడుకుంటూ మధ్య మధ్య కొంచెంసేపు నవ్వుతూ, కొంచెంసేపు ఏడుస్తూ ఉండేది. ఇదంతా చూస్తున్నకొద్దీ ఆ అమ్మాయికి పిచ్చేమోనని భయం కలిగేది. చిట్టచివరికి ఆమెతో ఆ రూములో ఒంటరిగా పడుకోవాలంటేనే భయం కలిగేది. ఆమెను ఆ రూమునుండి ఎలాగయినా వెళ్ళగొట్టాలి...ఉపాయం ఆలోచించాను.

ఒకరోజు ఆమె తన పెట్టెను తీస్తున్నప్పుడు వెనకనుండి జాగ్రత్తగా పరిశీలించాను. అందులో వారం రోజులనుండి కన్పించని నా పుస్తకం (గుడ్ ఎర్త్) ను చూశాను. ఇంకేమి? నా పాచిక పారినట్లేనని సంతోషించాను. ఆ రాత్రి నేనూ, ఇంకా యిద్దరు స్నేహితులూ గదిలో ప్రవేశించాము. ముగ్గురినీ ఒక్కసారి చూసి లలిత బెదిరిపోయింది. మేము ఆమెను పెట్టె తెరిచి చూపించమన్నాము. మే మనుకున్న దొకటి, అక్కడ జరిగిందొకటి. సిగ్గు పడుతుందో లేక ఎదురుతిరిగి పోట్లాడుతుందో అనుకున్నాము. కాని, అదేమీ జరగలేదు. మా వాక్యం ముగిసీ ముగియకముందే "అయ్యో, అయ్యో" అంటూ గావుకేక పెట్టింది. ఆ కేకతో హాస్టలంతా ప్రతిధ్వనించింది.

హాస్టలు పిల్లలంతా మా చుట్టూ చేరారు. మా వార్డెను కూడా పరుగెత్తుకొచ్చింది. లలిత జుట్టు పీక్కుంటూ, తలను గోడకు కొట్టుకుంటూ, పెడబొబ్బలు పెట్టి ఏడుస్తూవుంది. మేము ముగ్గురమూ అపరాధుల్లాగ కొయ్యబారి నిల్చుండిపోయాము.

మా వార్డెను మిగతా అందర్నీ వెళ్లి తమపనిని చూసుకోమని ఆజ్ఞాపించింది. లలితతో ఒక్క మాట కూడా మాట్లాడకుండా, మా ముగ్గుర్నీ తన వెంట రమ్మని సైగచేసి తన రూము వైపుకు వెళ్ళింది. రాబోయే ప్రమాదాన్ని ఊహించుకుంటూ, వణకుతున్న కాళ్ళతో ఆమెను వెంబడించాము.

వార్డెను అడగ్గా జరిగిన విషయమంతా చెప్పాము. ఆమె తాపీగా కూర్చుని అంతా విన్నది. ఆమెకు మా మీద ఏ మాత్రం కోపమున్నట్లు కన్పించలేదు. మా గుండెలు కొంతవరకు కుదుటపడ్డాయి. కాని ఆ ముఖం లోని విషాదచ్ఛాయల్ని చూస్తున్న మాకు ఆశ్చర్యం కలిగించింది.

మెల్లగా ఆమె చెప్పటం ప్రారంభించింది.

....................

"హాస్టల్లోని ప్రతివారూ ఆమెయొక్క వికృతమైన ప్రకృతిని అసహ్యించుకుంటున్నారని నాకు తెలుసు. మీరేకాదు—ఆమె బెదురు చూపుల చాటున దాగివున్న చితికిపోయిన హృదయాన్ని చూడలేని ఏ వక్కరూ, అపస్వరాలు తప్ప పలకని ఆమె ప్రకృతిని అసహ్యించుకోకుండా ఉండలేరు. ఆమె దొంగతనాలు చేస్తుందని నాకు తెలుసు. ఆమె దొంగ చూపుల అడుగున ఘనీభవించియున్న మూగ ఆవేదనను అర్థం చేసుకోలేని ఏ వక్కరూ, ఆమెను సానుభూతితో చూడలేరు.

మీ అందరిలాగ ఆమెను నేను అసహ్యించుకోలేక పోవటానికి కారణం...చిన్నప్పటినుండి ఆమె ఎటువంటి నిర్దాక్షిణ్య విషపూరిత వాతావరణంలో పెరిగిందో తెలియటమే.

ఇలా అసాధారణంగా ప్రవర్తించే ప్రతివారూ ఎప్పుడూ ఏదో మానని గాయంవల్ల తీరని బాధ అనుభవిస్తూంటారు. వారి హృదయాలు ఏదో తీరని అసంతృప్తితో విలపిస్తూ వుంటాయి. ఎప్పుడూ దేన్నో పొందాలని ప్రయత్నిస్తూ పొందలేక జీవితంలో వెలితిని అనుభవిస్తూ వుంటారు. జీవితంలో నిరాశ, పరాజయం తప్ప ఎరుగనివారి అసంతృప్త హృదయాలు, తృప్తిని రుచి చూడ తహతహ లాడుతుంటారు. ప్రపంచంలోని ప్రతి వ్యక్తీ తమకు చెందిన దేన్నో తమకు కాకుండా చేస్తున్నట్లు బాధపడుతూ వుంటారు. తమ బాధకు ప్రతిఫలంగా యితరులను బాధపెడుతూ తద్వారా దాన్ని తీర్చుకోవాలని ప్రయత్నిస్తూ వుంటారు. ఒక్కొక్కప్పుడు అలా చేస్తున్నామని వారికే తెలియకపోవచ్చు కూడా."

వూపిరి పీల్చకుండా ఉద్రేకంతో యింతవరకూ చెప్పి చటుక్కున ఆగిపోయిన వార్డెను ముఖంలోకి చూశాము ఆదుర్దాగా. ఆమె బరువుగా, దీర్ఘంగా వూపిరి పీల్చి, మళ్ళీ ప్రారంభించింది:

"కుష్ఠురోగి పుండ్లనుండి కారే చీమూ, రక్తమూ జుగుప్సాకరమైనదే. కాని ఆ పుండ్లను బాగా కడిగి మందు వేసి కట్టుకడితే రోగవిముక్తి కలిగిందని చెప్పలేము. అలాగే ఇలాంటివారు కొందరు తమ వికృతిని ప్రదర్శిస్తూ నలుగురి చేతా 'ఛీ' అనిపించుకుంటారు. యింకా కొంతమంది లోలోపలే కుమిలిపోతూ అవకాశం చిక్కినప్పుడు సమాజానికి చీడపురుగుల్లాగ తయారవుతారు. దీని కంతా కారకు లెవరని బహుశా మీరు అడుగుతారు. ఇలాంటివారి జీవిత పతనానికి సమాజంలోని ప్రతిఒక్కరూ, తెలిసో తెలియకో బాధ్యులే. అలాంటి పతిత జీవుల్లో లలిత ఒకర్తె.

నేను బి. టి. పూర్తిచేసిన సంవత్సరమే కుంభకోణంలో ఒక ఆడపిల్లల హైస్కూల్లో ఉపాధ్యాయినిగా చేరాను. అప్పుడు మేము లలితవాళ్ళింట్లోనే ఒక భాగంలో అద్దెకు వున్నాము అప్పటికి లలిత వయస్సు మూడు సంవత్సరాలు. ఆమెకు పన్నెండు సంవత్సరాల అన్న ఒకడు వున్నాడు. ఆ తల్లిదండ్రులకు ఈ యిద్దరే సంతానము. వాళ్ళనాన్న గుడ్డలవ్యాపారంలో చాలా డబ్బు సంపాదిస్తుండేవారు. తల్లి తండ్రీ యిద్దరూ చాలా మంచివారు. కొద్ది రోజుల్లోనే మేమూ వాళ్లూ చాలా సన్నిహితంగా వుండేవాళ్ళము. లలిత ఎప్పుడూ నా దగ్గరే ఉంటూండేది.

తల్లీ, తండ్రీ లలితను చాలా ముద్దుగా పెంచేవారు. ఆపిల్ల ఆడింది ఆట, పాడింది పాటగా వుండేది. ఇంట్లో కూతురు అడగాలేగాని కొండమీది కోతి నైనాసరే తెచ్చిఇచ్చేవాడు తండ్రి. ప్రొద్దస్తమానమూ వాకిట్లో కూర్చుని వచ్చే పోయే ప్రతి వస్తువూ కొనిపిస్తూ వుండేది. నిజం చెప్పాలంటే, డబ్బంతా అలా వ్యర్థంగా ఖర్చుపెడుతూవుంటే నాకే కష్టమనిపించేది. పెద్దవాళ్ళ స్వభావం తెలిసిందేగా యిలాంటి విషయాల్లో. ఒకరోజు మా అమ్మ అనేసింది వాళ్ళ ముందు. "అబ్బరాన బిడ్డపుడితే గడ్డపలుగుతో ముక్కూ చెవులూ కుట్టారట. ఎంత అలపం పోతున్నారమ్మా, పిల్ల అడిగితేమాత్రం అయిందానికీ కానిదానికీ అట్లా డబ్బు పాడుచేసుకుంటారా?" అంటూ బుగ్గ నొక్కుకున్నది. దానికి ఆమె తల్లీ తండ్రీ యిద్దరూ బాధపడ్డారు. నేను మా అమ్మను కోప్పడ్డాను. పైగా పోయేదాన్ని నెత్తిన పెట్టుకుంటున్నందుకు, ఇదంతా ఎందుకు చెబుతున్నానంటే... ఆ అమ్మాయి ఎంత ముద్దుగా పెరిగిందో తెలియజేయటానికే.

ఆ పిల్ల ఐదో సంవత్సరంనుండే అన్ని కష్టాలూ ప్రారంభమయాయి. ఐదో సంవత్సరంలోనే అమ్మ కరువయింది. ఆరు నెలలన్నా తిరక్కుండానే

ఆమె తండ్రి మళ్ళీ పెళ్ళిచేసుకున్నాడు. అంత ప్రేమగా చూసే ఆ తండ్రీ అందరు మగవాళ్ళలాగానే మారిపోయాడు, పడుచుభార్య రాగానే.

ఆమె సవతితల్లి పేరు కమల. చాలా అందంగానే వుండేది. అన్ని విషయాల్లో చాలా మంచిదనే చెప్పాలి. కాని ఆమె తల్లి దండ్రులు డబ్బుకు ఆశపడో, లేక యీ రోజుల్లోని యువకశిఖామణులకు కట్నాలు చెల్లించుకో లేకనో, బంగారంలాంటి పిల్లను యీ నలభై ఏళ్ళవానికి అంటగట్టారు.

అలాంటి స్థితిలోవున్న వారి మనస్సు ఎంత అసంతృప్తితో బాధ పడుతూ వుంటుందో మనము వూహించుకోవచ్చు. ఆమె అసంతృప్త హృద యానికి ఎరగా దొరికిందీ ఐదు సంవత్సరాల పసిబిడ్డ లలిత.

లలిత ఏదో ఒక విషయంలో రోజుకు ఒక్కసారైనా దెబ్బలు తినేది. తండ్రి చూస్తూ ముభావంగా వుండేవాడు. అంతకుముందున్న అతనిలోని ఆ పితృహృదయం ఏమయిందా అని బాధపడేదాన్ని యిదంతా చూస్తున్న నేను. కాని కన్నతండ్రే తటస్థంగా వున్నప్పుడు నేనుమాత్రం ఎలా కల్పించుకోగలను పరాయిదాన్ని ?

కంటిపాపలాగ ఎంతో జాగ్రత్తగా, ముద్దుగా పెరిగిన లలిత జీవితం ఒక్కసారిగా తల్లక్రిందులైంది. ఈ మార్పును ఎదుర్కొనే శక్తి ఆ అమాయ కపు పసిహృదయంలో యింకా రాలేదు. ఎప్పుడూ దెబ్బలు తినని ఆమె వీపు యిప్పుడు దెబ్బలతో కాయకాస్తుంది. అతి సుకుమారంగా పెరిగిన ఆమె చిన్న హృదయం, లేతమొగ్గలాంటి కోమలహృదయం...వికసించకుండానే సవతితల్లి యినుప చేతులతో నిర్దాక్షిణ్యంగా నలిపివేయబడింది. ఆమెలోని ఆత్మ నిద్ర పోయింది...చైతన్యం మొద్దుబారిపోయింది.

రోజు రోజుకూ లలిత దెబ్బలకుకూడా వెరవకుండా పోయింది. డబ్బు దొంగతనంగా తీసికెళ్ళి బెలూన్లూ అవీ కొనేది. తన కూతురు దొంగతనం చేసిందని విన్నప్పుడు ఆ తండ్రిలోని సంస్కార హృదయం కోపంతో కంపించి పోయేది. ఆరోజు తల్లీ తండ్రీ యిద్దరూ కలసి ఆ పిల్లను చాలా చితగ్గొట్టేవారు. ఆ రాత్రంతా నిద్రలోకూడా ఏదో పలవరిస్తూ వెక్కిళ్లుపెట్టే ఆ పిల్లను తలుచుకుంటే యీ రోజుకు సైతం నా గుండెలు తరుక్కుపోతాయి.

ఒక సుదినంచూసి ఆమెను స్కూలుకు పంపించారు. ఆరోజు నాకు చాలా సంతోషం కలిగింది. ఈమధ్య నాతోకూడ లలితను మాట్లాడనిచ్చేది

కాదు ఆమె పినతల్లి కమల. నా సానుభూతి ఆ అమ్మాయిని యింకా చెడపు తుందని ఆమె భయం కాబోలు. కనీసం యికనుండయినా తన తోటిపిల్లల్లో, ఉపాధ్యాయుల ఆదరంలో రోజంతా గడుపుతుందిగదా అనుకున్నాను. కాని మన దేశంలో, పిల్లల మనస్తత్వాన్నీ, వారి వాతావరణాన్నీ అర్థం చేసుకొని వారి లోపాలను సానుభూతితో, ప్రేమతో, ఓర్పుతో తీర్చగల ఉపాధ్యాయులు లేకపోవడం నిజంగా మన దురదృష్టమనే చెప్పాలి.

క్రమంగా స్కూల్లో లలిత మొద్దు, మొండి, దొంగ పిల్లల్లో ఒక పిల్లలాగ లెక్కించబడసాగింది. మాష్టరుగారి బెత్తం రోజుకు ఒక్కసారైనా ఆ మొండిపిల్ల వీపుమీద నాట్యం చేసేది. క్రమంగా ఆమెలోని మానవత్వం పశుత్వంగా—మూగ పశుత్వంగా మారుతోంది. పశువును కొడుతూ పొండి. అది సహిస్తూ పోతుంది. సరిగా లలిత కూడా అలాగే తయారయింది.

దెబ్బలతో ఆమె శరీరం ఎంత కొయ్యబారిపోయిందో ప్రతివారి తిర స్కారంతో కూడిన మాటలతో ఆమె హృదయం కూడా అంత మొద్దుబారి పోయింది. చిన్నపిల్ల దగ్గర ఉండే ఆమె సవతి తల్లి "ముది ముండ" అనీ, ఎన్నేళ్ళు వస్తేనేమి...నీకూ వచ్చినయి. ఆ పం...కీ వచ్చినవి. నీతా జాతా, చీమూ, రక్తమూ" అని తిడుతూంటే నాకు ఎంతో బాధగా ఉండేది. కాని లలిత మాత్రం తనను కాదన్నట్లు తుడుచుకుపోయేది.

ఇదంతా చూస్తున్న వాళ్ళ అన్న ఎంతో బాధపడుతూండేవాడు. చాటు చాటున ఏడ్చి కళ్ళు తుడుచుకొనేవాడు. కాని అతను మాత్రం ఏం చేయగలడు ? అతను పెద్దవాడు కావటంవల్లనో, ఎందుచేతనో నేను సరిగా చెప్పలేను. కాని, మొత్తంమీద కమల మాత్రం అతన్ని ప్రేమగానే చూసేది. బి. ఏ లో ప్రెసిడెన్సీకి ఫస్టు వచ్చాడు. అందువల్ల అతన్ని గవర్నమెంటే అమెరికా పంపింది, అతను అమెరికా వెళ్ళేనాటికి లలితకు పదకొండు సంవత్స రాలు.

ఆ సంవత్సరంలోనే లలిత స్కూల్లో ఏదో దొంగతనం చేసిందని "డిస్మిస్" చేశాడు హెడ్మాష్టరు. ఆ రోజునుండి ఆమె జీవితం యింట్లో యింకా దుర్భరమయింది. నాలుగు గోడలమధ్య అడకత్తెరలోని వక్కలాగ గడిచిపోతోంది ఆమె జీవితం. సవిత తల్లి చూడకుండా మధ్య మధ్య నా

దగ్గరకు వస్తూండేది. కర్మంచాలక చూసిందా ఆ రోజు లలితకు మూడిందే ఆమె చేతిలో.

లలిత జీవితంలో పదహారు హేమంతాలు దాటిపోయాయి. కాళ్ళు యీడ్చుకుంటూ భారంగా, యిక్కడనుండి లలిత జీవితంలో ఒక నూతనాధ్యాయం ప్రారంభమయింది. ఎడారిలాగ ఎండిపోయిన ఆమె జీవితపు పవనంలో ఒకే ఒకసారి పాదం పెట్టాడు వసంతుడు. కాని యిప్పుడు ఆ పాదం తాలూకు చిహ్నం మాత్రమే ఉండిపోయింది. బహుశా పొగచూరిపోయిన ఆమె హృదయం ఆ పాద చిహ్నాన్ని నిరంతరం ప్రశ్నిస్తూ ఉండవచ్చు. "ఎడారిలాగ నిరంతరం మండుతుంటే నా హృదయంలో ఒక్క ఆశాపుష్పం వికసించదా ? జీవితాంతం వరకూ ఎండమావుల భ్రమలో పడి, చివరికి అసంతృప్తితో అంతం కావలసిందేనా ?" అంటూ.

మా పెదనాన్న కొడుకు మద్రాసులో బి. ఏ. చదువుతుండేవాడు. అతను సున్నిత హృదయం ఉన్నతాదర్శాలు గలవాడు. ఆ సంవత్సరం వేసవి సెలవులు కుంభకోణంలో గడపాలని వచ్చాడు. నా ద్వారా లలిత విషయమంతా విన్నాడు. విన్నంతసేపూ కన్నీరు కార్చాడు.

లలిత సాధారణంగా మధ్యాహ్నం సమయాల్లో మా ఇంటికి వస్తూండేది. అప్పుడు ఆమె తల్లి దండ్రులు నిద్రపోతూండేవారు. క్రమంగా రామారావు లలితలు మాట్లాడుకోవటం ప్రారంభించారు. రామారావుకు మొదట ఆమె మీద సానుభూతి, దయా మాత్రముండేవి. కొద్ది కాలంలోనే అవి ప్రేమగా పరిణమించాయి.

రామారావు పరిచయంతో ఆమెలోని నిద్రపోయిన చైతన్యం చిన్నగా వళ్ళు విరుచుకుంటూ మేల్కొంటున్నది. రామారావు ఆ అమ్మాయిని వివాహం చేసుకుంటాడని నాతో చెప్పినప్పుడు చాలా సంతోషించాను. కాని జీవితంలో కోరిందల్లా జరిగిపోతుంటే ఒక విధంగా అది జీవితమే కాదేమో ?

ఒకరోజు నిద్రలో ఏడుపులూ, అరుపులూ విని ఉలిక్కిపడి లేచాను. లలిత తండ్రి ఆమెను తాడు తీసుకుని కొడుతున్నాడు. ఆమె పెద్దగా ఏడుస్తూంది. "సంగనాచి చీర నడివీధిలోనట్టు, ఎంత మెత్తగావుండి గుండెలు తీసిన పని చేస్తున్నావే ? వాణ్ణి చూసిన మొదటి రోజే అనుకున్నా...వాడి

దొంగ చూపులూ వాడూనూ...అందుకే నెత్తిన నోరు పెట్టుకు చెపుతూనే వున్నా వాళ్ళను యీ యిల్లు ఖాళీ చేయించమని..." యిలాగ ఏమేమో అంటున్నది. విషయం కొంత అర్థమయింది.

రామారావు గదిలో దిగాలుపడి కూర్చున్నాడు. మధ్యాహ్నం అంతా నిద్రపోతున్నారుగదా అని లలిత మా యింటికి వచ్చిందట, ఆ రోజు నాకూ ఎప్పుడూ లేని నిద్రవచ్చి పడింది. వాళ్ళిద్దరూ కూర్చుని ఏదో పిచ్చాపాటీ మాట్లాడుకుంటున్నారట. ఇది ఎలా పసిగట్టిందో కమల. యింకేముంది కొంప మునిగిపోయినంత అల్లరిచేసి వదిలింది.

వ్యవహారం బెడిసి కొట్టింది. ఏం చేయటానికీ తోచలేదు. రెండవరోజు ఉదయానికల్లా యిల్లు ఖాళీచేసి మా ఊరు వెళ్ళవలసి వచ్చింది. ఆ సంవత్సరమే నాకు మద్రాసుకు బదిలీ కావటంవల్ల మరల కుంభకోణం పోవాల్సిన అవసరం కలుగలేదు. అంతే. ఆ తర్వాత చాలా కాలంవరకు ఆమెను గురించి మాకేమీ తెలియలేదు. ఒక రకంగా నేనూ, రామారావు కూడా లలితను మరచిపోయామనే చెప్పాలి."

అంతవరకూ గుక్క తిప్పుకోకుండా చెప్పి ఆగిన మా వార్డెను ముఖం లోకి ఆదుర్దాగా చూశాము. కొంచెంసేపు మౌనంగా ఉండి మరల ప్రారంభించింది.

"ఆ తరువాత నాలుగు సంవత్సరాలకు వాళ్ళ అన్నతో సహా యీ హాస్టల్లోనే చూశాను. ఆమెను చూస్తూనే మొదటికంటె ఘోరంగా వికృతని పొందిన ఆమె ప్రకృతిని అర్థం చేసుకున్నాను.

"తర్వాత వాళ్ళ అన్నద్వారా తెలిసిన విషయమిది. ఆ వెంటనే అంటే మేము యిల్లు ఖాళీ చేసిన వెంటనే లలితకు పెళ్ళి చేశారట. ఆమె సవతి తల్లి దూరపు బంధువొకడు యాభయ్యో పడిలో పడ్డవానికి ఇచ్చారట. అప్పటికే అతను ఇద్దరు భార్యల్ని మింగి కూర్చున్నాడట. మూడు ముళ్ళూ వేసి ఆమెను అత్తవారింటికి పంపి, తల చిక్కు దీసినట్లు ఒక తృప్తితో కూడిన నిట్టూర్పు విడిచి ఉంటారా తల్లీ తండ్రీ.

"తర్వాత ఆరునెలలకు అమెరికానుండి వచ్చిన అన్న చెల్లెలి పెండ్లి విషయం విని ఏడ్చాడట ఆ రోజు యింట్లో పచ్చి మంచినీళ్ళయినా ముట్టి

కుండా లలిత అత్తవారింటికి బయలుదేరాడు. ఆ గ్రామం చేరుకునేప్పటికి బాగా ప్రొద్దుపోయింది. వాళ్లనీ వీళ్లనీ వాకబు చేస్తూ యిల్లు చేరుకున్నాడు.

యింటిముందు ఒక భీకర దృశ్యం ప్రత్యక్షమయింది. పిల్లలూ, పెద్దలూ, ఆడవాళ్ళూ, మగవాళ్లూ గుమిగూడి ఉన్నారు. ఒక పురుషుడు ఒక స్త్రీని జుట్టు పట్టుకుని బర బర బయటకు యీడుస్తున్నాడు. స్త్రీ జాతిమీద జరిగే పురుషుల దౌర్జన్యాన్ని చూస్తున్న అతని రక్తం ఆవేశంతో ఉరకలు తీస్తూంది. జనాన్ని నెట్టుకుంటూ ముందుకు పోయాడు.

"ఆఁ...ఎవరామె ? తన చెల్లి! మరి ఆ ముసలివాడో ? తన భావ మరిదా ?" ఒక్క ఊపులోబోయి ఆ పురుష సింహుని మెడ పట్టుకుని ముందుకు తోశాడు. అతడు పోయి దూరంగా బొగ్గబోర్లా పడ్డాడు. అంత వరకూ వాకిట్లో నిల్చుని కొడుకుయొక్క ప్రతాపాన్ని తృప్తిగా చూస్తున్న అతని ముసలి తల్లీ, యింకా మొదటి భార్య తాలూకు ఒక పిల్లా, రెండవ భార్య తాలూకు ముగ్గురు పిల్లలు "గీబా" మంటూ ఏడుస్తున్నారు. చుట్టూ మూగిన జనం నాటకంలోని అంతర్నాటకాన్ని వింతగా చూస్తున్నారు.

చెల్లెలు అన్నను గుర్తుపట్టింది. అన్నను అమాంతంగా కౌగలించుకుని ఏడ్చింది సిపిల్లలాగ అక్కడ ఒక్క క్షణం కూడా నిల్చోకుండా చెల్లెలి చెయ్యి పట్టుకుని స్టేషన్ వైపు బయలుదేరాడు. అతనిలో మాట్లాడటానికి శక్తిలేదు. ఆలోచించటానికి అంతకుముందే లేదు. రక్తం నర నరంలో ఘోష పెడుతూ ప్రవహిస్తూంది. తల్లినీ, తండ్రినీ ముక్కలు ముక్కలుచేసి కాకులకూ గద్దలకూ వేయాలనిపిస్తుంది.

యింటికి తీసుకొచ్చిన తర్వాత అన్న చెల్లెలికి నీడలాగ ఉంటూ ఆమె ఎండిపోయిన గుండెను స్నేహసిక్తం చేయాలని ప్రయత్నించాడు. అన్న ప్రేమ ఆ మండు టెడారిలో ఆవిరైపోయిందేకాని తేమను పుట్టించలేక పోయింది.

చివరికి మద్రాసు మెట్రిక్ చదివించటానికి తీసుకుని వచ్చాడు. నన్ను ఇక్కడ చూసి చాలా సంతోషించాడు. తన చెల్లెలి చితికిపోయిన జీవితానికి ఒక రూపాన్ని కల్పించమని నా చేతిలోపెట్టి పోయాడు. ఆ తర్వాత విషయ మంతా మీకు తెలిసిందేగా ?"

నా కండ్లవెంట నీరు కారుతూంది. గుండెలు బరువెక్కాయి. ఉండబట్టలేక అడిగాను. "ఇక ఆమె జీవితం అలా పోవాలిసిందేనా ? మార్పు తేవటానికి ఉపాయమే లేదా ?"

"ఒకసారి పగిలిన అద్దాన్ని మళ్ళీ సరిచేయలేము. ఆ ముక్కలన్నీ జాగ్రత్తగా చేర్చి ఆ అద్దానికి ఒక రూపాన్ని కల్పించినా, దాంట్లో మొదటి కాంతీ, నిర్మలత్వమూ రాదు. బింబము మసగ్గా ఉంటుంది. అలాగే ఆమె చితికిన హృదయానికి ఒక రూపాన్ని కల్పించవచ్చు. దానికి ప్రేమ, సానుభూతి అవసరం. ఆమె హృదయం ప్రేమించలేదు. కాని ప్రేమను స్వీకరించలేదు. యితరులను ఆదరించి గౌరవించలేదు. ఆదర గౌరవాలను ఆహ్వానించగలదు. లోపాలను ప్రేమతో, సానుభూతితో చూసేవారు కావాలి" అంటూ మా వార్డెను నా వంక ప్రశ్నార్థకంగా చూసింది.

గంట క్రితం మా ప్రవర్తనను తల్చుకుని సిగ్గుపడ్డాము. ఆమె దగ్గర క్షమాపణ చెప్పుకొని బరువెక్కిన శరీరంతో బయటపడ్డాము. ఆ రాత్రి నాకు ఆ రూములోకి వెళ్ళటానికే ధైర్యం చాలలా. ఆ రాత్రి నేను కూడా మా స్నేహితుల రూములోనే పడుకున్నాను. యికనుండి ఆమెతో మేమెలా ప్రవర్తించాలో మాట్లాడుకుంటూ ఏ మూడుగంటలకో నిద్రపోయాము.

......................

రెండవరోజు ఎనిమిది గంటలయినా లలిత ముసుగు తీయలేదు. నేను దగ్గర కూర్చుని చిన్నగా ముసుగు తొలగించి లేపపోయాను. శరీరం మండిపోతూంది వడ్లగింజలు పేలాలయేలాగ. కళ్ళు తెరచి చూస్తూంది. కాని నన్ను కాదు. ఎవర్నో...ఏదో పలవరిస్తున్నది కూడా. కళ్ళు చింతనిప్పుల్లాగ ఎర్రగా ఉన్నాయి.

నాకు భయంవేసి మా వార్డెన్ను పిల్చుకొని వచ్చాను. వెంటనే హాస్పటలుకు తీసుకెళ్ళాము. వారం రోజులు లలిత హాస్పటల్లో ఉన్నా మన ప్రపంచంలోకి రాలేదు. నేను ఆ వారం రోజులూ ఆమె బెడ్ ప్రక్కనే ఉన్నాను. ఒక్కసారి నన్ను గుర్తు పట్టగలిగితే ఎంత బావుండునూ, నేను క్షమాపణ వేడుకుందును అని ఆలోచించేదాన్ని. కాని యీ వారం రోజుల్లో ఒక్క క్షణకాలంకూడా తన ప్రపంచాన్ని వదిలి యీ ప్రపంచంలోకి రాలేదు.

అవును, ఎందుకు రావాలి ? యీ ప్రపంచం తన కిచ్చిన ఆనందం ఏమిటి ? తనకు యిచ్చిందల్లా, తిరస్కారమూ, అవమానం, దుఃఖం అంతేగా ?

కళ్లు తెరచి నేరుగా చూస్తూ ఏదో పలవరిస్తూ ఉండేది. అస్పష్టంగా మధ్య మధ్య కొన్ని శబ్దాలు మాత్రం స్పష్టంగా వినిపించేవి "అమ్మా నన్ను కూడా...దొంగతనం...అందరూ అసహ్యించు..." యిలాగే ఎన్నో శబ్దాలు వినిపించేవి.

ఆ దృశ్యాన్ని చూస్తున్న మా అందరి హృదయాలు బాధతో మూలిగేవి. వాళ్ళ అన్న చెల్లెలి ముందుకు రాకుండా ఏడ్చేవాడు. తల్లి రాలేదు కాని తండ్రి వచ్చాడు. ఎంత కాదన్నా కన్న కడుపేగా పాపం, చాల ఏడ్చాడు.

ఏడవరోజు ఉదయం అగ్ని పర్వతంలోని జ్వాలలు ఆరిపోయాయి. లలిత దొంగ చూపులూ, బెదురు చూపులూ శాశ్వతంగా విశ్రాంతి తీసుకున్నాయి. యింక వాటిని ఎవ్వరూ అసహ్యించుకోరు. అపస్వరాలు తప్ప పలకని ఆమె హృదయ తంత్రుల్లో నిస్తబ్దత గూడు కట్టుకున్నది. ఇంక ఆ అపస్వరాల తాలూకు కఠోరశబ్దం ఎవర్నీ బాధ పెట్టదు.

(ఆంధ్రపత్రిక వారపత్రిక 1953)